క్లుప్తంగా

ట్యూబ్‌లైట్ల బహూకరణ



చెన్నారావుపేట : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి సమాచార పరిరక్షణ హక్కు చట్టం కమిటీ ఆధ్వర్యంలో సాదబోయిన రాజు, జాటోత్ యాకూబ్‌లు సోమవారం 10 ట్యూబ్‌లైట్లు బహూకరించారు. స్పెషల్ ఆఫీసర్ మెట్టుపల్లి జ్యోతి, ఉపాధ్యాయులు షాహీన, రాజ్యలక్ష్మి, పల్లవి, రజిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లి పంచాయతీ నూతన భవనానికి నిధులు మంజూరయ్యాయి. కాగా సోమవారం జెడ్పీటీసీ కోమాండ్ల జయగోపాల్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రీమియం నగదు అందజేత

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని నెహ్రూనగర్ పురుషుల పొదుపు పరస్పర సహాయక సహకారం సంఘం సభ్యుడిగా ఉన్న ఏడవెల్లి రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు ప్రీమియం లావాదేవీలు సరిచూసి మృతుడి భార్యకు సోమవారం రూ.86వేల 560లు నగదును సమితి అధ్యక్షుడు, సంఘం అధ్యక్షులు అందజేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



నల్లబెల్లి : తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని సర్పంచ్ మామిండ్ల మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని కొండాయిల్‌పల్లిలో రూ.50 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం సర్పంచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొలగాని సదయ్య, పంచాయతీ కార్యదర్శి విష్ణు, నాయకులు కొనుకటి వీరమల్లు, తాడెబోయిన విజయ్, ఎద్దు ఐలయ్య, ఎద్దు లింగయ్య, ఊరటి వీరస్వామి, హరిమోహన్, రవి తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్స్ కళాశాలలో సోమవారం ఎంబీఏ రెండో సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్‌రెడ్డి హాజరై ప్రారంభించారు.

అభినందనలు

వర్ధన్నపేట : కాంగ్రెస్ పార్టీలో చేరిన కేఆర్ నాగరాజును సోమవారం పైడిపెల్లి మాజీ సర్పంచ్ జన్ను అభిషేకం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగరాజు రాకతో కాంగ్రెస్ మరింత బలోపేతం అయిందన్నారు. నాయకత్వంలో తాము పని చేసి వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చెన్నారావుపేట : చెన్నారావుపేట గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి పత్తి అనంత రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచి పోయిందన్నారు. రోడ్డు వెడల్పు పనులలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ నాయకులు గుగులోత్ నర్సింహ ఉన్నారు.

క్షీరాభిషేకం

చెన్నారావుపేట : చెన్నారావుపేట నుంచి కోనాపురం, ఉప్పరపల్లి మీదుగా మచ్చాపురం వరకు డబుల్ బీటీ రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించినందుకు కోనాపురం బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వెల్దె సారంగం, రాజుకుమార్, మహేందర్, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

పరామర్శ



సంగెం : మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త రావిపాటి వెంకటేశ్వర్‌రావును మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు సోమవారం పరామర్శించారు. ఇటీవల వెంకటేశ్వర్‌రావు తల్లి నాగేంద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. నాగేంద్రమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, దశమంతరెడ్డి, ఈగ మల్లేశం, సారయ్య, మహేష్, జయరావు, సురేష్, వాసం సాంబయ్య, నరేష్ పాల్గొన్నారు.

సర్పంచ్‌లు గోస పడుతున్నారు!

- చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బందులు
- మండలంలో మొరం, రియల్‌ఎస్టేట్ దందాను ఆపాలి
- సర్వసభ్య సమావేశంలో తీర్మానం



మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ సౌజన్య

గీసుకొండ : మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పాటు పలు నిధుల కింద చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు కావడం లేదు.. దీంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అరిగోస పడుతున్నారని మండల సభలో సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బీమగాని సౌజన్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ వీరేశం, తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు పాల్గొన్నారు. మండలంలోని కాకతీయ ప్రధాన కాల్వకు ఇరువైపులా ఉన్న మొరంను బడా బాబులు తరలిస్తున్నా అధికార యంత్రాంగం, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఇదేంటని అడిగితే సంబంధిత శాఖల వారు తమ పరిధి కాదంటూ దాటవేస్తు అక్రమార్కులకు అనుకూలంగా ఉన్నారని పలువురు సభ్యులు వాపోయారు. మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌ను నియమించాలని కోరారు. జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు మాట్లాడుతూ కొనాయమాకులలో పింఛన్ దారులు గీసుకొండకు వెళ్లి డబ్బులు తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని, స్థానికంగా పంపిణీ చేయాలని కోరారు. ఆర్టీసీ బస్సులను మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలను లింకప్ చేస్తూ సర్వీసులు నిర్వహించాలని సభ్యులు కోరారు. 'కుడా' లేఅవుట్ లేకుండా అక్రమంగా వెంచర్లు చేసి ప్లాట్లను విక్రయిస్తున్నారని, రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కోఆప్షన్ సభ్యులు రహీం, ఎంపీటీసీ సభ్యులు గోపాల్, నాగసబోయిన రజిత, సర్పంచ్‌లు అల్లం బాలిరెడ్డి, గోనె మల్లారెడ్డి, అంకతి నాగేశ్వర్‌రావు, మండల అధికారులు పాల్గొన్నారు.

టీకాలు తప్పకుండా వేయించాలి



పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న ప్రకాశ్

ఖానాపురం : ఐదేళ్ల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్ సూచించారు. ఈ మేరకు మండలంలోని కొత్తూరు సబ్‌సెంటర్‌తో పాటు పీహెచ్‌సీలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం ద్వారా టీకాలు వేయించని వారికి వేయించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వైద్యులు భూపేష్, హెల్త్ సూపర్‌వైజర్స్ రామలింగయ్య, శ్రీలత, దేవిక, మంగమ్మ, శ్రీవాణి, భాస్కర్, రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగనిరోధక శక్తి



నల్లబెల్లి: అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్లు

నల్లబెల్లి : తల్లిపాలు అమృతంలాంటిదని, శిశువుకు రోగనిరోధక శక్తిని అందించడంలో దోహదపడుతాయని నల్లబెల్లి, రుద్రగూడెం క్లస్టర్ల సూపర్‌వైజర్లు జాన్సీరాణి, శ్యామల అన్నారు. మండలంలోని నల్లబెల్లి, కొండాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి రజిత, అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మి, సునీత, సువర్ణ, భాగ్యలక్ష్మి, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండల వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని చిలుకమ్మతండా పంచాయతీ పరిధిలో సూపర్‌వైజర్ రమ ఆధ్వర్యంలో వేడుకలను చేపట్టారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ వెంకన్న, ఉపసర్పంచ్ ఈర్య, పంచాయతీ కార్యదర్శి పోశాల యుగేందర్, హెచ్‌ఎం జగ్గయ్య, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని కొండూరు అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌పాల్గొని పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు.

సకాలంలో మందులు వేయాలి

నెక్కొండ : గొర్రెలు, మేకలకు గాలికుంటు, ముద్ద చర్మ వ్యాధులు సోకకుండా యజమానులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి మమత అన్నారు. నెక్కొండ పశువైద్యశాలలో సోమవారం ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో జీవాలు వ్యాధుల బారిన పడి మృత్యువాత పడే ప్రమాదం ఉందని, సకాలంలో టీకాలు, మందులు అందించాలని ఆమె సూచించారు. మండలంలో నెక్కొండ పశువైద్యశాల పరిధిలోని పలు గ్రామాల్లో నేటి (మంగళవారం) నుంచి ఈనెల 25 వరకు ఉచిత టీకాలు, మందును గొర్రెలు, మేకలకు అందించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రాయపర్తి: మండలంలోని తిర్మలాయపల్లిలో సోమవారం గాలికుంటు టీకా, నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి ప్రారంభించారు.

పశువులను కాపాడుకోవాలి

పర్వతగిరి : రైతులు తమ పశువులను రోగాలు రాకుండా టీకాలు వేయించి కాపాడుకోవాలని జిల్లా కో ఆప్షన్ సభ్యుడు సర్వర్, ఇస్లావత్‌తండా సర్పంచ్ ఇస్లావత్ రమేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఇస్లావత్‌తండాలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి, ముద్ద చర్మవ్యాధి వ్యాక్సినేషన్, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి నరేష్, వెటర్నరీ అసిస్టెంట్ అమరావతి, గోపాలమిత్రలు ఉపేందర్, వెంకన్న, రైతులు మూడు వెంకన్న, మూడు మోతీరాం, ఇస్లావత్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం



సంగెం: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



వర్ధన్నపేటలో..



గీసుకొండలో..

పర్వతగిరి : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని యువజన సంఘం రాష్ట్ర నాయకుడు మంద రవి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.ఇస్మాయిల్, కళాకారుల సంఘం జిల్లా నాయకుడు కె.రవి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎంసీపీఐ(యూ) అనుబంధ ప్రజా సంఘాల నాయకులు తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.

రాయపర్తి : మండలకేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట ఎంసీపీఐ(యూ), తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సోమవారం ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి గుగులోతు అరుణ్‌నాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నర్సంపేట రూరల్ : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ)నర్సంపేట డివిజన్ కార్యదర్శి కొత్తకొండ రాజమౌ, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ మాషుక్ అన్నారు. నర్సంపేట మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి అనంతరం పలు డిమాండ్లతో వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ ఉమారాణికి అందించారు.

వర్ధన్నపేట : బీఆర్‌ఎస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ(యు) వరంగల్ డివిజన్ కార్యదర్శి మంద రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యు), తెలంగాణ ప్రజాసంఘాల రోట వేదిక ఆధ్వర్యంలో సోమవారం వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఫణికుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తి అయిన తెలంగాణ సమాజం ఆశించిన విధంగా సమస్యలు పరిష్కరించలేకపోయిదంన్నారు. గుగులోత్ అరుణ్, సుల్తాన్ సారయ్య, రంగారావు, సురేష్, గణేష్, సాంబరాజు, బాబు, అశోక్, కాజామియా, భిక్షపతి, రవి తదితరులు పాల్గొన్నారు.

సంగెం : ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక మండల నాయకులు ఇస్మాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని నాయబ్ తహసీల్దార్ రాజేశ్వర్ రావుకు అందజేశారు.

పేదలకు ఇంటి స్థలం కేటాయించాలి

గీసుకొండ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంసీపీఐ(యు) ఆధ్వర్యంలో పేదలకు ఇంటి స్థలాలు, పట్టాలతో పాటు , ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున సాయం అందించాలని సోమవారం ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు. గోనె కుమారస్వామి, మల్లికార్జున్‌రావు, కనకం సంధ్య, కందికొండ కుమారస్వామి, బండి బుచ్చయ్య పాల్గొన్నారు.

ఇళ్లు లేని వారికి 'ఇంటి బంధు' ఇవ్వాలి

దుగ్గొండి : ఇళ్లు లేని వారికి ఇంటి స్థలం కేటాయించడంతో పాటు ఇంటి బంధు పథకం ద్వారా రూ.10లక్షలు అందించాలని ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అలాగే ధరణి లోపాలను సరిచేయడానికి డిజిటల్ సర్వే చేపట్టాలని, తహసీల్దార్‌లకు రికార్డులు సరిచేసే అధికారం ఇవ్వాలని, సర్వే నంబర్‌ల యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు.

సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం



వర్ధన్నపేట : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు దగ్ధమైన సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని ఇల్లంద గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం మండలంలోని ఇల్లందకు చెందిన మటం సంపత్ ఆదివారం అదే గ్రామంలోని వేరే ఇంటికి వెళ్లారు.కాగా రాత్రి సంపత్ ఇంట్లోంచి మంటలు వస్తుండడంతో ఇరుగు పొరుగు వారు ఆర్పే ప్రయత్నం చేస్తుండగానే గ్యాస్ సిలిండర్ పేలింది. ఇంతలోనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. తాము కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, కల్పన, కావ్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారని మటం సంపత్ భార్య రజిత రోదిస్తు తెలిపింది. ఇంట్లో ఉన్న వస్తువులు, వంట సామగ్రి, అన్ని కాలిబూడిద అయ్యాయని బోరున విలపించారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

విజయవంతం చేయాలి

నర్సంపేట : ఈ నెల 13వ తేదీన చేపట్టిన చలో కోరుట్ల పద్మశాలి రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని పద్మశాలి సంఘం అధ్యక్షుడు రుద్ర ఓంప్రకాశ్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని కార్యాలయంలో సోమవారం పద్మశాలి రాజకీయ యుద్ధభేరి వాల్ పోస్టర్లను గౌరవ అధ్యక్షుడు బాల్నె సర్వేశం అధ్యక్షతన ఆవిష్కరించారు.

'రైతుల రుణమాఫీ కాంగ్రెస్ విజయం'



పార్టీలో చేరిన వారితో దొంతి మాధవరెడ్డి

నెక్కొండ /దుగ్గొండి : ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడం కాంగ్రెస్ సాధించిన విజయమని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో దొంతి మాట్లాడారు. అనంతరం బీఆర్‌ఎస్‌కు చెందిన నెక్కొండ మండలంలోని సూరిపల్లి, తోపనపల్లి గ్రామాలకు చెందిన పలువురు దొంతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువా కప్పి స్వాగతించారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు అధికసంఖ్యలో ఆయా పార్టీలకు రాజీనామా చేసి దొంతి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేదంటే ఉపాధ్యాయుల సమస్యలపై దశల వారిగాపోరాటం తప్పదని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యూఎస్‌పీసీ) జిల్లా నాయకులు కూసమల్ల కొమ్మాలు, దార్ల రవీందర్ అన్నారు. నర్సంపేట మండల ఎమ్మార్సీ ఆవరణలో ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 12న జిల్లా కేంద్రాలలో ర్యాలీలు, సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మహా ధర్నా పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వసుమతి, ఎస్‌కే సర్దార్, పూజారి రవి, నాగేశ్వర్, కిషన్‌సింగ్, వెంకటేశ్వర్లు, పాలడుగుల రాజేందర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



ఖానాపురం: రాస్తారోకో చేస్తున్న జీపీ కార్మికులు



దుగ్గొండి: వరంగల్-నర్సంపేట రహదారిపై..

నల్లబెల్లి : మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల మండల అధ్యక్షుడు ఎండీ యాకుబ్ పాషా డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనిగరం శివారులో జాతీయ రహదారిపై సోమవారం రాస్తారోకో చేశారు.

గీసుకొండ : మండలంలోని కొనాయమాకుల వద్ద వరంగల్-నర్సంపేట రహదారిపై గ్రామపంచాయతీ ఉద్యోగులు సమ్మెలో భాగంగా సోమవారం రాస్తారోకో నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ అలీ, మండల అధ్యక్షుడు కనకాచారి, కుమ్మరికుంట్ల రమేశ్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నర్సంపేట రూరల్ : జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని జేఏసీ మండల అధ్యక్షుడు ఆనంద్ అన్నారు.

దుగ్గొండి : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం మండలంలోని గిర్నిబావిలో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం జేఏసీ అధ్యక్షుడు గాదం రాజాలు మాట్లాడారు.

నెక్కొండ : తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ.. స్థానిక అంబేడ్కర్ సెంటర్లో జీపీ కార్మికులు ధర్నా చేపట్టారు.

కఠిన వైఖరి సరికాదు

ఖానాపురం : గ్రామ పంచాయతీ కార్మికులపై కఠిన వైఖరి సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా సమ్మయ్య అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీపీ కార్మికులు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం రాస్తారోకో చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

గీతకార్మికుడికి గాయాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన తండ మొగిళి గీత వృత్తిలో భాగంగా సోమవారం ఉదయం గ్రామ శివారులోని తాటి వనంలోకి వెళ్లి తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారీ కిందపడిపోవడంతో మొగిళికి కాళ్లు, చేతులు, నడుము తీవ్రగాయాలయ్యాయి.

వీధి దీపాల ఏర్పాటు

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండలో సోమవారం సర్పంచ్ గటిక సుష్మమహేష్ వీధి దీపాలను ఏర్పాటు చేయించారు.

నాణ్యమైన విద్య అందించాలి

ఖానాపురం : విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయ ఆవరణలో రాగి పిండి, బెల్లం పిండి ప్యాకెట్లను సోమవారం అందజేశారు.

ఆర్థిక సాయం

చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త సలేంద్ర రమణాచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ సహకారంతో గ్రామ నాయకులు రూ.5,000 ఆర్థిక సాయం అందించారు.

జీపీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

నల్లబెల్లి : మండలంలోని బుచ్చిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ భవనపనులను మండల పంచాయతీ అధికారి ప్రకాశ్ సోమవారం ప్రారంభించారు.

గద్దర్‌కు ఘన నివాళి

ఖానాపురం : మండల వ్యాప్తంగా గద్దర్‌కు పలు పార్టీల నాయకులు నివాళులర్పించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్యలతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు నివాళులు అర్పించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గద్దర్‌కు సోమవారం నివాళులర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు హరిబాబు, ఎలగందుల రాజు, మోడెం ఎల్లగౌడ్‌ల ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నివాళి

నల్లబెల్లి : ప్రజా సమస్యల కోసం జీవించిన వ్యక్తి గద్దర్ అని సీపీఎం మండల కార్యదర్శి కడియాల మనోహర్ అన్నారు. గద్దర్ మృతి పట్ల మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పర్సంటేజీలు పంచుకున్న మాజీ ఎమ్మెల్యేలు

ఖానాపురం : రంగాయ చెరువుకు దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి నిధులు మంజూరు చేస్తే మాజీ ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి పర్సంటేజీలు పంచుకున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య ఆరోపించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఉచిత వైద్యశిబిరం



వర్ధన్నపేట : మండలంలోని దమ్మన్నపేటలో సోమవారం బాలవికాస ఆధ్వర్యంలో హనుమకొండలోని లక్ష్మీనరసింహ ఆస్పత్రి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయగా సర్పంచ్ అర్షుల మంగతిరుపతిరెడ్డి ప్రారంభించారు. ఆస్పత్రి వైద్యురాలు సంధ్యారాణి పలు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

దాడిని ఖండించాలి

నర్సంపేట : చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి నాయకులపై దాడిని ఖండిస్తున్నామని ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి పైసా గణేష్ అన్నారు. ఈ మేరకు నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.

అవగాహన

వర్ధన్నపేట : విద్యార్థి దశ నుంచే మానవత విలువలు పెపొందించుకునే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సామాజిక కార్యకర్త బంక మాణిక్యం అన్నారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మానవత విలువలపై అవగాహన కల్పించారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

నెక్కొండ : సీపీఎం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్. రంగయ్య సోమవారం డిమాండ్ చేశారు.

సైకిల్ యాత్రను జయప్రదం చేయాలి



నర్సంపేట : భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరిగే సంఘర్షణ సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివరాత్రి అనిల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని భద్రకాళి ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

చేనేతను కాపాడుకోవాలి

నర్సంపేట : చేనేతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి కుల బాంధవుడిపై ఉందని పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రుద్ర ఓంప్రకాశ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పద్మశాలి సంఘం కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను సోమవారం సంఘం గౌరవ అధ్యక్షుడు బాల్నె సర్వేశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఓంప్రకాశ్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరిస్తూ అందరూ ధరించేలా చూడాలని కోరారు.

ఉరివేసుకుని ఆత్మహత్య

నర్సంపేట రూరల్ : నర్సంపేటకు చెందిన తౌటి భాస్కర్(48) గతంలో స్థానికంగా టైలర్ షాపు నిర్వహించాడు. ప్రస్తుతం హనుమకొండలో మెకానిక్ షెడ్ ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో నర్సంపేట నుంచి హనుమకొండకు ప్రతిరోజూ వెళ్లి వస్తుండే వాడు. కాగా సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి సంబంధించి ఆర్థిక ఇబ్బందులా.. మరే కారణాలా.. తెలియాల్సి ఉంది. భాస్కర్‌కు భార్య అరుణ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. దీనిపై స్థానిక పోలీసులను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం జరిగింది. కాజీపేట జీఆర్‌పీ ఎస్సై సీహెచ్.పరుశరాములు తెలిపిన కథనం ప్రకారం.. రాయపర్తి మండలం తిర్మలాయపల్లికి చెందిన ప్రభాకర్(40)కు భార్య అనిత, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతడు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా ఆర్థిక ఇబ్బందులతో తరచుగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు సోమవారం ఉదయం ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో మద్యంలో క్రిమిసంహారక మందు కలిపి తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రయాణికులు గుర్తించి రైల్వే సిబ్బందికి సమాచారం అందించగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. జీఆర్‌పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.